క్లుప్తంగా

పౌష్టికాహారం తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

నాయుడుపేట టౌన్: పౌష్టికాహారంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆహారాన్ని వాడాలని సీడీపీఓ ఉమామహేశ్వరి సూచించారు. నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం పోషకాహార మాసోత్సవ ముగింపు కార్యక్రమాలను నిర్వహించారు. ఎల్‌ఏ సాగరం అంగన్‌వాడీలో సీడీపీఓ పాల్గొన్నారు. సూపర్‌వైజర్ మణెమ్మ, టాటాట్రస్టు కోఆర్డినేటర్ అశోక్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

పెళ్లకూరు: మండలంలోని బంగారంపేట గ్రామంలో బుధవారం నెల్లూరు నారాయణ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బంగారంపేట, మోదుగులపాళెం, ఊడిపూడి, రోసనూరు, రాజుపాళెం తదితర గ్రామాలవారు వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు అందుకున్నారు. డాక్టర్లు వినీత, ప్రశాంత్, పీఆర్‌ఓ నందకిశోర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు అమలుచేయాలి



డిపో మేనేజర్‌తో చర్చిస్తున్న తులసీరామ్ తదితరులు

గూడూరు రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ డిపోల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు చట్టాలను సక్రమంగా అమలు చేయాలని ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరామ్ అన్నారు. ఆర్టీసీ డిపోల పర్యటనలో భాగంగా గురువారం గూడూరు ఆర్టీసీ డిపోను సందర్శించారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులతో కలసి గూడూరు డిపో మేనేజర్ పీసీహెచ్ లక్ష్మిని కలసి సమస్యలపై చర్చించారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు మల్లికార్జున, కె.ఎస్.వాసులు, రఘురామయ్య, బి.వి.రమణయ్య పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రికి ఇన్వర్టర్



డాక్టర్ షరీనాకు ఇన్వర్టర్‌ను అందజేస్తున్న దాతలు

గూడూరు రూరల్: ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ప్రగతి సేవా సంస్థ, శ్రీకృష్ణ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో రూ.19 వేలు విలువ చేసే ఇన్వర్టర్‌ను గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనాకు అందజేశారు. ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్, చిరంజీవి, డాక్టర్ రాజా, డాక్టర్ ప్రసన్న, మురళీనాయుడు, కేఆర్‌ఎం, ప్రభాకర్, విశ్రాంత ఎస్‌ఐ ప్రభాకర్, రాము, వెంకటేశ్వరరావు, మల్లికార్జున, నాగరాజు, యశ్వంత్, వెంకట్రావు, శంకర్, కృష్ణారెడ్డి, ఆసుపత్రి సిబ్బంది మౌలాలి పాల్గొన్నారు.

ఫలసరుకులు పంపిణీ



ఫలసరుకులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

గూడూరు రూరల్: పట్టణంలోని డీఎస్‌ఆర్. కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ, టౌన్, వెస్ట్ క్లబ్స్ సేవా కార్యక్రమంలో భాగంగా నిరుపేద వృద్ధులకు నెలకు సరిపడా ఫలసరుకులను అందజేశారు. వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.వి.రావు, వైజేపీ క్లబ్ ప్రెసిడెంట్ సుధాకర్, శ్రీనివాస్‌యాదవ్, గోపీనాథ్‌రెడ్డి, ప్రసాద్, వై.గురునాధం, ఎస్.ఎల్.ఎన్.స్వామి, రవీంద్రరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, హరికృష్ణ, కావేరి తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి హేయమైన చర్య



గూడూరు: కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

గూడూరు రూరల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) బి.ఆర్.గవాయ్‌పై దాడి హేయమైన చర్య అని తిరుపతి మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు చింతా మోహన్ అన్నారు. గూడూరు పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ వద్ద గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చింతా మోహన్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తున్నామని, దేశ వ్యాప్తంగా దళితులపై దాడులు ఎక్కువైపోయాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణారావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు 17-10-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	125
లేయర్ లైవ్	:	122
బ్రాయిలర్ చికెన్	:	226
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	250
లేయర్ చికెన్	:	207

అదిగో.. ఇదిగో.. టిడ్కో ఇళ్ల పంపిణీ



సూళ్లూరుపేట టిడ్కో ఇళ్లు

- ఇళ్ల పంపిణీలో తీవ్ర జాప్యం
- కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడిచినా సొంతం కాని ఇళ్లు

సూళ్లూరుపేట మున్సిపాలిటీలోని నిరుపేదలకు ఇళ్లు కట్టి ఇస్తామని 2014–19లో అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ మాట తప్పింది. ఆ తరువాత 2019–24లో అధికారంలో ఉన్నపుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇవ్వలేదని నిందలు వేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా ఎందుకు ఇవ్వలేకపోతున్నారని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. పట్టణానికి ఆరు కిలో మీటర్లు దూరంలోని అటవీప్రాంతాన్ని ఎంపిక చేసి టిడ్కో ఇళ్లు నిర్మించారు. ఐదేళ్ల పరిపాలనా కాలంలో ఇవ్వకుండా లబ్ధిదారుల జీవితాలతో ఆడుకున్నారు. 2019లో ఎన్నికలు రావడంతో నిర్మాణాలు పూర్తి కాకుండానే అప్పటికప్పుడు మున్సిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణ ఎన్నికల స్టంట్‌లో భాగంగా ఆగమేఘాల మీద 1399 మందికి ఇళ్లు పంపిణీ చేసినట్టుగా గొప్పలు చెప్పుకున్నారు. ఆ కాలనీలో మౌలిక సదుపాయాలను కల్పించకుండానే, ఇళ్లు నిర్మాణాలు పూర్తి కాకుండానే ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకోవడం కోసం హడావిడిగా పంపిణీ కార్యక్రమాన్ని ఆర్భాటంగా నిర్వహించేశారు. రెండో సారి అధికారంలోకి వచ్చినా టిడ్కో ఇళ్లు పంపిణీకి నోచుకోకపోవడంపై లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – సూళ్లూరుపేట

పట్టణానికి ఆరు కిలోమీటర్లు దూరంలో సూళ్లూరుపేట–శ్రీకాళహస్తి రోడ్డుకు పక్కనే అటవీ ప్రాంతం సమీపంలో 1824 ఇళ్లు నిర్మించేందుకు 2015లో శ్రీకారం చుట్టారు. 1824 ఇళ్లకు ఒక్కో బ్లాక్‌లో 48 ఇళ్ల లెక్కన 38 బ్లాక్‌లు నిర్మించాల్సి ఉండగా కేవలం ఆరు బ్లాకులు మాత్రమే అరకొరగా పూర్తి చేసి 2019 ఎన్నికల్లో ప్రజల్లోకి ఓట్లు కోసం వెళితే తరుముకుంటారని లబ్ధిదారులకు ఇచ్చేసినట్టుగా చెప్పుకోవడానికి హడావిడిగా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి మమ అనిపించారు.

వైఎస్‌ఆర్ సీపీ హయాంలోనే మౌలిక వసతులు

గడిచిన ఐదేళ్లలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసంపూర్తిగా ఉన్న ఇళ్లు నిర్మించడమే కాకుండా టిడ్కో కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, కరెంట్, తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. ఇన్ని చేసినా ఈ సంవత్సర కాలంలో లబ్ధిదారులకు ఎందుకివ్వలేకపోతున్నారో సమాధానం చెప్పాలని కోరుతున్నారు. బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించినా ఇళ్లు ఇవ్వకుండా కాలయాపన ఎందుకు చేస్తున్నారని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. బ్యాంక్‌ల నుంచి నోటీసులు వస్తున్నాయని, ఇళ్లు చేతికి రాకుండా ఈఎంఐలు ఎలా కడతామని లబ్ధిదారులు అంటున్నారు. 1389 మంది ఇళ్లకు సంబంధించి సూళ్లూరుపేటలోని 11 బ్యాంకుల్లో ఒక్కో బ్యాంక్‌కు 127 ఇళ్ల లెక్కన కేటాయించారు. ఈ లెక్కన ఒక్కో బ్యాంక్ కనీసం రూ.4 కోట్లు లెక్కన రుణాలిచ్చాయి. ఇందులో కొన్ని బ్యాంకులు ఇవ్వలేదని కూడా తెలుస్తోంది. 1824 ఇళ్లలో 1389 మందికి ముందుగా ఇచ్చేసినట్టుగా మున్సిపల్ అధికారులు 2019 ఎన్నికలకు ముందే ప్రకటించేశారు. మిగిలిన 425 మందికి బ్యాలెన్స్ అలాగే పుండిపోయింది. ఇంటి నిర్మాణం పేరుతో అనాటి ప్రభుత్వం లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి రుణం తీసిచ్చి మరింత రుణగ్రస్తులను చేసింది. 2014–19 సంవత్సరంలో అధికారంలో వున్న టీడీపీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుండి ఒక్కరికి కూడా ఒక్క ఇల్లు ఇవ్వకుండానే కాలం గడిపేసింది. ప్రస్తుతం ఏడాదిన్నర కాలం పూర్తయినా కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్ల పంపిణీ దిశగా అడుగులు పడడం లేదు.



ఓ వైపు పెయింట్లు లేకుండా ఫినిషింగ్ దశలో ఉన్న టిడ్కో ఇళ్లు

కాకాణితో నేదురుమల్లి సమావేశం

వెంకటగిరి (సైదాపురం): వైఎస్‌ఆర్ సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలు, స్థితిగతులపై చర్చించుకున్నారు.

నేడు వెంకటగిరికి కాకాణి రాక

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్‌ఆర్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వెంకటగిరిలో నిర్వహించనున్న కోటి సంతకాలు కార్యక్రమానికి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని నేదురుమల్లి కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలియజేసింది. పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు కోటి సంతకాల కరపత్రం ఆవిష్కరణ నిర్వహించనున్నట్లు తెలిపారు.



కాకాణి గోవర్ధన్‌రెడ్డితో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

యూరియా కోసం ఎదురుచూపులు



కురుస్తున్న వర్షం



నార్తువరత్తూరులో మొలకెత్తిన ఎల్లి పైరు

చిట్టమూరు: మండలంలో గురువారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. అలాగే పగలంతా ఆకాశం మేఘావృతమై సాయంత్రం వర్షం పడడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మెట్ట ప్రాంతాల్లో రబీ సీజన్‌లో ఇప్పటికే రైతులు విత్తనాలు చల్లి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. వర్షం పడడంతో రైతులు ఎరువులు వేసే పనిలో నిమగ్నమయ్యారు. చెరువు నీటి ఆధారంగా రైతులు వరి నార్లు పోశారు. అయితే యూరియా ఒక్క బస్తా కూడా ఇవ్వకపోవడంతో నారు మడులకు యూరియా కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అయితే ఎన్నడూ లేనివిధంగా భూమి పత్రాలు అందజేస్తే యూరియా కోసం కార్డులు ఇస్తున్నట్లు చెబుతున్నారు. అయితే సాగు విస్తీర్ణం నమోదు చేసుకుంటున్నారు తప్ప ఇంత వరకు ఒక్క యూరియా బస్తా కూడా రైతులకు అందలేదు. మరో పక్క మెట్ట ప్రాంతాల్లో వరి విత్తనాలు చల్లి 15 రోజులు అవుతోందని, పైరు మొలకెత్తడంతో యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. వ్యవసాయాధికారులు స్పందించి యూరియా అందజేయాలని రైతులు కోరుతున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని మందరిల్లులోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా పొదుపు మహిళలకు కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయశ్రీ చిరుధాన్యాలు, మునగ ఆకు పొడి, వేరుశనగ చిక్కీల తయారీ విధానంపై అవగాహన కల్పించారు. సీడీపీఓ శంషాద్ బేగం, సూపర్ వైజర్ సుహాసిని, అంగన్‌వాడీ కార్యకర్తలు మల్లీశ్వరి, మహిళలు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి



వ్యాయామ ఉపాధ్యాయులకు సన్మానం

కోట: మండలంలో కొత్తగా ఉద్యోగాల్లో చేరిన ఐదుగురు వ్యాయామ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం కోట జెడ్పీ హైస్కూల్‌లో గురువారం జరిగింది. ఐదుగురు వ్యాయామ ఉపాధ్యాయులు వెంకట వసుధ, యామిని, సంధ్యారాణి, మోహిని, సురేష్‌లను వ్యాయామ ఉపాధ్యాయ సంఘం తరపున సన్మానించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ మస్తానయ్య, హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, రజినికుమారి, పీడీలు రాజ్‌కుమార్, రమణయ్య, సంధానీ బాషా, వలీఅహ్మద్ పాల్గొన్నారు.

యమపాశాలు

– ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

చిట్టమూరు: మండల పరిధిలోని తంబుగారిపాళెం గ్రామంలో విద్యుత్ తీగలు కిందకు జారి పోయి ప్రమాదకరంగా ఉన్నాయి. సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఇళ్లకు సరఫరా అవుతున్న విద్యుత్ వైర్లు తెగిపోయాయి. దీంతో వాటిని జాయింట్ వేసి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అవి కూడా కిందకు జారి పోవడంతో అటుగా వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. పొలాల్లో విద్యుత్ వైర్లు కిందకు జారి పోవడంతో మేతకు వెళ్లిన పశువులు ఎక్కడ మత్యువాత పడుతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో పక్క చిన్న గాలీవానకు కూడా విద్యుత్ వైర్లు మరమ్మతులకు గురికావడంతో సరఫరా నిలిచిపోతోంది. పలుమార్లు స్థానిక విద్యుత్ సిబ్బందికి తెలిపినా ప్రయోజనం లేకుండా పోయిందని గ్రామస్తులు చెబుతున్నారు. విద్యుత్ శాఖవారు నియమించిన ప్రైవేటు వ్యక్తి వినియోగదారులపై పెత్తనం చలాయిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్తులు చందాలు వేసుకుని వైరు కొనుక్కుని తెచ్చుకుంటే మరమ్మతులు చేస్తానని ప్రైవేటు వ్యక్తి చెబుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని విద్యుత్ తీగలకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చేతికి అందే ఎత్తులో కిందకు జారిన విద్యుత్ తీగలు, తెగిపోయిన తీగలకు ప్రమాదకర జాయింట్లు

నేడు రచ్చబండ కార్యక్రమం

చిల్లకూరు: కోటి సంతకాల సేకరణలో భాగంగా చేపడుతున్న రచ్చబండ కార్యక్రమం శుక్రవారం చిల్లకూరు మండలంలో నిర్వహించినున్నట్లు మండల కన్వీనర్ యద్దల మధుసూదన్‌రెడ్డి గురువారం తెలిపారు. గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో నిర్వహించే కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నెలబల్లి రెట్టపల్లి, ముత్యాలపాడు, పారిచెర్లవారిపాళెం, తిప్పగుంటపాళెం గ్రామాలలో చేపట్టనున్నట్లు తెలిపారు.

కోటి సంతకాల కార్యక్రమానికి తరలిరండి

రాపూరు: వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో శుక్రవారం జరిగే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై కోటి సంతరకాల కరపత్ర ఆవిష్కరణకు రాపూరు మండలం నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని మండల వైఎస్‌ఆర్ సీపీ కన్వీనర్ బొద్దు మధుసూదన్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్ సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ పాపకన్ను మధుసూదన్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

నాటి విద్యార్థి.. నేటి గురువు



బాధ్యతలు తీసుకుంటున్న చెంచుకృష్ణ

వాకాడు: మండలంలోని వెంకటరెడ్డిపాళెం పల్లిపాళెం గ్రామానికి చెందిన రుద్రవరం చెంచుకృష్ణ గత ఇరవయ్యేళ్ల కిందట మండల కేంద్రమైన వాకాడులోని ఎస్‌ఏఎల్సీఈఎఫ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి. ఉన్నత చదువులు అభ్యసించి నేడు అదే పాఠశాలకు ఉపాధ్యాయుడిగా రావడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. ఎంఏ, పీహెచ్‌డీ చేసిన చెంచుకృష్ణ గురువారం తాను చదువుకున్న పాఠశాలలో ఇంగ్లీషు ఉపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టారు.

ప్రయాణికుల అవస్థలు

కోట: బస్సులు రద్దు చేయడం ప్రయాణికులకు కష్టాలు తెచ్చి పెట్టింది. వాకాడు డిపో ఆర్టీసీ సర్వీసులను కర్నూలులో ప్రధాని పర్యటనకు కేటాయించడంతో కోటలో ప్రయాణికులు బస్సుల్లేక గంటల తరబడి నరకం చూశారు. డిపోలో ఉన్న 43 సర్వీసుల్లో 25 సర్వీసులను కర్నూలు పంపినట్లు అధికారులు తెలిపారు. కోట నుంచి నెల్లూరు, నాయుడుపేట నడిచే సర్వీసులు నిత్యం రద్దీగా ఉంటాయి. అయా రూట్లలో బస్సులు లేకపోవడం, ఒక వేళ బస్సు వచ్చినా ప్రయాణికులు కిటకిటలాడడంతో అవస్థలు పడ్డారు. చివరకు బస్సులు అందుబాటులో లేవంటూ బస్టాండ్ ప్రాంగణంలో నోటీసులు అంటించారు.

కార్మికుడిపైకి దూసుకెళ్లిన క్రేన్

పెళ్లకూరు: పెన్నేపల్లిలో ఉన్న ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో పని చేసే వలస కార్మికుడు రాహుల్‌దాస్‌పై క్రేన్ దూసుకెళ్లడంతో గాయపడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. స్టీల్ పరిశ్రమ ఆరుబయట ప్రమాదవశాత్తు రాహుల్‌దాస్ కుడి కాలిపైకి క్రేన్ దూసుకెళ్లింది. ఈఘటనలో రాహుల్‌దాస్ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. కంపెనీ యాజమాన్యం హుటాహుటిన నాయుడుపేటకు తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తరలించారు.

రుచికరంగా మధ్యాహ్న భోజనం



విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎంపీడీఓ

దక్కిలి: విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని ఎంపీడీఓ రవీంద్రబాబు తెలిపారు. తీర్థంపాడు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం ఎంఈఓ వెంకటేశ్వర్లు, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు.

కూటమి ప్రభుత్వానికి కళ్లు తెరిపిద్దాం



సంతకాల సేకరిస్తున్న ఎమ్మెల్సీ మురళీధర్



నాయకులతో మాట్లాడుతున్న మురళీధర్

వాకాడు: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్‌ఆర్ సీపీ తలపెట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంతో కూటమి ప్రభుత్వానికి కళ్లు తెరిపిద్దామని ఆ పార్టీ గూడూరు నియోజకవర్గం సమన్వయకర్త మేరిగ మురళీధర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన గురువారం వాకాడులో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలను కలసి రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాల ఏర్పాటుపై చర్చించారు. ఇటీవల వైఎస్‌ఆర్ సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా ఎంపికైన బాలిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన కొడవలూరు భక్తవత్సలరెడ్డిని శాలువాలతో సత్కరించి అభినందించారు. మేరిగ మురళీధర్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వచ్చిన 17 మెడికల్ కాలేజీలను చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటీకరించడం దుర్మార్గమైన ఆలోచన అని మండి పడ్డారు. గ్రామాల్లో రచ్చ బండ కార్యక్రమాలతోపాటు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు చేపట్టి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. నాయకులు నాగూర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, హిమకుమార్‌రెడ్డి, రవి, జనార్దన్ రెడ్డి, పెంచలరెడ్డి, రాజారెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కోట: కోటకు చెందిన వ్యాపారి రామిరెడ్డి కోటారెడ్డి సతీమణి జ్యోతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె గూడూరు రూరల్ మండలానికి చెందిన వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు రాధాక్రిష్ణారెడ్డి సోదరి. దీంతో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ గురువారం కోటలో వారి నివాసానికి చేరుకుని జ్యోతి చిత్రపటానికి నివాళులర్పించారు. రాధాక్రిష్ణారెడ్డి, కోటారెడ్డి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, రమణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

చిల్లకూరులో...

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని సనత్ నగర్‌లో ఉన్న వైఎస్‌ఆర్ సీపీ కార్యాలయంలో గురువారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని 4, 5 వార్డులకు సంబంధించి నిర్వహించారు. పేద విద్యార్థులకు అండగా ఉండేలా వైఎస్‌ఆర్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాలను సేకరించి రాష్ట్ర గవర్నర్‌కు సమర్పిస్తామని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. అనంతరం సంతకాల సేకరణ చేపట్టారు. బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్: మండలంలోని జంగాలపల్లి పంచాయతీ సర్పంచ్ పాలూరు ప్రమీల భర్త పాలూరు మనోహర్ రెండు రోజుల క్రితం మృతి చెందాడు. సమాచారం అందుకున్న వైఎస్‌ఆర్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి జంగాలపల్లిలోని మనోహర్ నివాసం వద్దకు చేరుకున్నారు. మనోహర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. చిట్టేటి హరికృష్ణ, సదానందరెడ్డి, దొరస్వామి, సుబ్రమణ్యం, రాజా తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ హుండీ ఆదాయం రూ.59.79 లక్షలు



హుండీలను లెక్కింపు

సూళ్లూరుపేట: శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో గురువారం హుండీలు లెక్కించగా 102 రోజులకు గాను రూ.59,79,520 నగదు ఆదాయం వచ్చిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.ప్రసన్నలక్ష్మి తెలిపారు. గురువారం ఉదయాన్నే దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో హుండీలను తెరిచారు. అన్ని హుండీలను లెక్కించగా రూ.59,79,520 నగదుతోపాటు 48 గ్రాముల బంగారం, 69 గ్రాములు వెండి కూడా హుండీలో లభించిందని తెలిపారు. 185 యూఎస్‌ఏ డాలర్స్, 15 సింగపూర్ డాలర్స్, 30యుఏఈ థిరమ్స్, 15 సౌదీ రియాల్స్, సెంట్రల్ బ్యాంక్ 1–2 దినార్, 10 నేపాల్ రూపాయల ఆదాయం వచ్చిందని తెలిపారు. దేవాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, శ్రీరామలింగ చాముండేశ్వరి దేవీ మహిళా సేవా సమితి సభ్యులు, శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి భక్త జన బృందం, విశ్రాంత బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పది స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను చూపుతున్న ఉపాధ్యాయులు

చిల్లకూరు: జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో చదివే పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించేందుకు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని పారిచెర్లవారిపాళెం జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం అనసూయ తెలిపారు. మండలంలోని పారిచెర్లవారిపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గూడూరు కానిస్టేబుల్ శనగా మస్తానయ్య స్టడీ మెటీరియల్ అందించారని తెలిపారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, కామేశ్వరి, సుగుణ, నాగభూషణమ్మ, మధుసూదన్‌రావు, విద్యుల్లత, రవీంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దారి ఆక్రమణపై నిరసన



రియల్ ఎస్టేట్ పనుల వద్ద నిరసన తెలుపుతున్న నాంచారమ్మపేట గ్రామస్తులు

చిల్లకూరు: ఎన్నో ఏళ్లుగా ఉన్న దారులను రియల్ ఎస్టేట్ వ్యాపారులు పూర్తిగా మూసి వేయడంపై నాంచారమ్మపేటవాసులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిల్లకూరు మండలం ముత్యాలపాడు పంచాయతీలోని నాంచారమ్మపేటకు సమీపంలో సాగరమాల రోడ్డు సమీపంలో రియల్ ఎస్టేట్ వెంచర్ వేశారన్నారు. అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారులు గ్రామం చుట్టూ దారులు మూసివేసి, వెంచర్ చుట్టూ ప్రహరీ గోడలు నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. శ్మశానం, తాగునీటి బోరు వద్దకు వెళ్లే దారులు మూసివేయడంపై వారు తహశీల్దార్, గూడూరు సబ్ కలెక్టర్‌కు విన్నవించామని తెలిపారు. పట్టించుకోకపోవడంతోనే నిరసన కార్యక్రమం చేపట్టి, పనులు అడ్డుకుంటున్నామని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ఆరోగ్య సూత్రాలు తెలియజేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

చిల్లకూరు: ఇంటి పరిసరాలతో పాటు పాఠశాలలో కూడా పరిశుభ్రతను పాటించాలని మండల విద్యాశాఖాధికారి-2 రవూఫ్ సూచించారు. మండలంలోని బూదనం గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను వైద్య సిబ్బందితో కలసి ఆయన గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ అధికారి ముత్యాలమ్మ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆశా వర్కర్ సుజాత, హెచ్‌ఎం ఉషాదేవి, ఉపాధ్యాయులు క్రిష్ణప్రసాద్, పద్మశ్రీ ఉన్నారు.

సైన్స్‌పై అవగాహన అవసరం

గూడూరు రూరల్: సైన్స్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఎంతో అవసరమని జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ అన్నారు. గూడూరు పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ వద్ద గురువారం జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ పరీక్షల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న స్కూల్ స్థాయిలో, నవంబరు 1వ తేదీన మండల స్థాయిలో చెకుముకి సైన్స్ పోటీలను నిర్వహిస్తామన్నారు. జేవీవీ ప్రతినిధులు నాగరాజు, చెంచునారాయణ, శ్రీనివాసాచారి, సురేష్, ఇబ్రహీం, రజనీకాంత్, పవన్‌కుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా పోస్టర్ల విడుదల



మెగా జాబ్‌మేళా పోస్టర్ల ఆవిష్కరణ

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద మెగా జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ నెల 22వ తేదీ సూళ్లూరుపేటలోని శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో అనేక కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని సీఎస్ తేజ సెంటర్ వద్ద మున్సిపాలిటీ స్థలంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అధ్యక్షత న నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పి.రామయ్య, నెలవల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట: పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి బీపీఎస్–ఎల్‌ఆర్‌ఎస్ గ్రాంట్ కింద రూ.2 కోట్లు మంజూరయ్యాయి. దీంతో బస్టాండ్ సెంటర్‌లో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

జోరు వాన

దక్కిలి: రెండు రోజుల నుండి జల్లులుగా వర్షం కురుస్తోంది. చిన్నపాటి వర్షం కురవడంతో పలు గ్రామాల్లో ఉన్న వీధులు బురదమయంగా తయారై పాదచారులు సైతం అవస్థలు పడుతున్నారు. మరో వైపు ఈ వర్షం నిమ్మ రైతులకు ఊరటనిచ్చింది.

రాపూరు: పలు గ్రామాల్లో గురువారం ఉదయం నుంచి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది.